

# అక్కడే ఆగక

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

**(గత సంచిక తరువాయి)**

"**ఆ రోజుల్లో టేప్ రికార్డర్లో** పదే పదే విన్న పాటలు ఇప్పుడు యూ ట్యూబ్‌లో ప్లే లిస్ట్‌లో పెట్టుకుని వింటూ గడ్డం గీసుకుంటాను. స్నానం చేస్తాను. పడుకున్నాక నిద్ర పట్టేదాకా వాటిని వింటాను. అవన్నీ గుండెల్లో గుబులుని రేకెత్తిస్తాయి. 'మేరే పియా – మేరే పియా గయే రంగూన్ – దియా హై వహాసే పహ్లీ ఫోన్ – ఇంకా శంకర్ కిషన్ సంగీతంలో ముఖేష్ పాడిన శైలేంద్ర లిరిక్స్ ఎంత భావోద్వేగాలని సృష్టిస్తాయో అనుభవిస్తే కాని అర్థంకాదు. తుమ్హారీ యాద్ సతాతా హై... తుమ్హారీ యాద్ సతాతా హై.." సూర్యచంద్ర తండ్రి పాడాడు.

సంజీవ వెళ్ళబోయేముందు సూర్యచంద్ర తూలుతూ చెప్పాడు.

"ఇదవకు. ఎవరూ బార్‌లో పోలేదు. నలుగురు ఏక్టర్స్ జిమ్ లో పోయారు. తాగినవాడూ జబ్బుతో పోతాడు. తాగనివాడూ జబ్బుతో పోతాడు. పోవడానికి రేపూ రారా ఫ్రెండూ. నీ మనసులోని బాధ, నీ ఒంటి బరువు తగ్గుతాయిలే."

"నా మనసులో బాధేంలేదు."

"ఏడ్చావ్. నాకు తెలీదనుకుంటున్నావు కాని మన స్నేహం ముప్పై రెండేళ్ళనాటిది."

ఇంటికి వచ్చాక సంజీవ మజ్జిగలో అల్లప్పచ్చడి వేసి రంగరించి దాన్ని తాగాడు. సంజీవకి ప్లెయిన్ మజ్జిగకన్నా అది రుచిగా ఉంటుంది.

"నాకు నా చిన్నప్పటి సంగతులు గుర్తుకి వస్తున్నాయి ప్రవం" చెప్పాడు.

"ఏమిటి గుర్తుకి వస్తున్నాయి?"

"నా చిన్నప్పటివి. ప్రతి రాత్రి మాదాకబళం తల్లీ అంటూ మిగిలిపోయిన అన్నం తీసుకెళ్ళే బిచ్చగాళ్ళు ఇప్పుడు రావడంలేదు. అప్పట్లో మర్నాటికి అన్నం పాడైపోతుందని గుమ్మంలో నిలబడి బిచ్చగాళ్ళకోసం ఎదురుచూసేవాళ్ళం బుట్టలోతాచుపాములతో, చొక్కా, లాగు తొడిగిన కోతితో అది దణ్ణం పెట్టు అంటే దణ్ణం పెట్టేది– ముక్కుకి తాడు కట్టిన తోడేలుతో అడుక్కునేవాళ్ళు వచ్చేవాళ్ళు. ఏకతారని వాయించుకుంటూ వాటిని అమ్మేవాళ్ళు. వాళ్ళు నాగిన్ పాటని చక్కగా వాయించేవాళ్ళు కాని మనకి వచ్చేదికాదు. సంక్రాంతి టైంలో గణాచారులు గజ్జలు కట్టుకుని వచ్చేవాళ్ళు. బుడబుక్కలవాళ్ళు, గంగిరెద్దులవాళ్ళు, హరిదాసులు వచ్చేవాళ్ళు.

ఆయవారం బ్రాహ్మణులు ఉచితంగా తీసుకోకూడదని ఆ రోజు తిథి, వారం, నక్షత్రం చెప్పి భిక్ష తీసుకునేవారు. మూడు నెలలకోసారి వచ్చే గారడీవాళ్ళు పావలా ఇస్తే కప్పని సృష్టించేవాళ్ళు. మళ్ళీఅది పావలాగా మారిపోయేది. ఇప్పుడా కులం పేరు ఉచ్చరించడమే జైల్లో పెట్టే నేరంగా చేసారు. వాళ్ళు  తీగమీద బేలన్స్ తప్పకుండా నడుస్తూ రకరకాల విన్యాసాలు చేసి అడుక్కునేవాళ్ళు. పిచ్చికుంట్లవాళ్ళు ఇంటిపేరు చెపితే చాలు. గోత్రం చెప్పేసేవాళ్ళు."

భర్త మనసు బాలేదని ప్రవర్ధనకి తెలుసు కాబట్టి ఎన్నడూ మాట్లాడని సంగతులు ఆయన చెప్తూంటే వింటోంది.

"కోయదొరలు రకరకాల ఈకల కిరీటాలు పెట్టుకుని వచ్చేవారు. సోదెవాళ్ళు బియ్యం ఇస్తే సోది చెప్పేవాళ్ళు."

ఆయన బాల్యపు జ్ఞాపకాలని వింటూ ఆవిడ నిద్రపోయింది.

ఆ రాత్రి అకస్మాత్తుగా సంజీవకి మల్లీశ్వరి సినిమాలో తను చిన్నప్పుడు విన్న పాటొకటి గుర్తుకి వచ్చి, మొబైల్‌ని తెరచి యుట్యూబ్‌లో వెదికి దాన్ని పెట్టాడు. అది వింటూంటే ఓసారి తన తండ్రి తన తల్లికి చెప్పిన మాటలు గుర్తుకి వచ్చాయి.

"ఒసేయ్ విను. ఈ పాటలో ఎవరోకాని ఏడుపునే రాగంగా కట్టినట్లుగా లేదూ?"

రాణివాసానికి వెళ్ళే మల్లీశ్వరికి వీడ్కోలు చెపుతూ పేరంటాళ్ళు పాడిన పోయిరా మా తల్లి పోయిరావమ్మా  పాటని మరోసారి ప్లే చేసాడు.

12

మర్నాడు ఉదయం ఆద్యకి ఈల పాట వినిపించి మెలకువ వచ్చింది. చుట్టూ చూసాక తను ఎక్కడ ఉందో అర్థంకాక కొద్దిసేపు అవస్థపడింది. లేచి తలుపు తెరచుకుని బయటకి వచ్చి, కిందనించి ఈల వినిపిస్తోందని గ్రహించి మెట్లమీదకి వెళ్ళి చూసింది మోకాళ్ళదాకా ఉన్న ఆకుపచ్చ పాతగౌన్, ఏప్రన్ ధరించిన ఓ ముప్పై – ముప్పై ఐదేళ్ళ నల్లజాతి యువతి పొడుగాటి చీపురుతో హాల్‌ని ఊడుస్తూ విజిల్ వేస్తోంది. ఆమె తలమీద రింగులు తిరిగిన జుట్టు అరంగుళం మించిలేదు. వెంటనే ఆమె మెయిడ్ అని గ్రహించింది. వెనక్కి తిరిగి బాత్‌రూంలోకి వెళ్ళింది. అక్కడ అద్దానికి మూడు పెద్ద పోస్ట్ ఇట్ కాగితాలు అతికించి ఉన్నాయి. వాటిలో తెలుగులో రాసి ఉంది.

'డాలీ! బ్రేక్‌ఫాస్ట్‌గా, ఛీజ్ సేండ్‌విచెస్ చేసి బల్లమీద ఉంచాను. వాటిని ఇరవై క్షణాలు మైక్రోవేవ్ ఓవెన్‌లో వేడీ చేసుకుని తిను. ఫ్రిజ్‌లో అన్నం, పీటా బ్రెడ్, ఫలాఫల్ ఉన్నాయి. కొద్ది తేడాతో పీటా బ్రెడ్ మన చపాతీలాంటిది. వాటిని మైక్రోవేవ్ ఓవెన్‌లో వేడి చేసుకుని ఫలాఫల్, ఆనియన్ రింగ్స్ వేసి చూట్టుకుని తిను .తెలుసుగా? నో స్టీల్ ఇన్ మైక్రోవేవ్ ఓవెన్. ఇంట్లోని పింగాణీవన్నీ మైక్రోవేవ్ ఓవెన్ సేఫ్‌వే. పింగాణీ ప్లేట్‌లో అన్నం, పదార్థాలు ఉంచుకుని వేడి చేసుకుని లంచ్ చెయ్యి. అల్మైరాఓ అప్పడాలు, బిస్కెట్స్, షార్ట్ ఈట్స్, ఎనర్జీ బార్లు ఉన్నాయి. కాఫీ పొడి, చక్కెర డబ్బా స్టవ్ పక్కనే పెట్టాను. కాఫీ మెషీన్ ఎలా యూజ్ చెయ్యాలో నిన్న చెప్పాల్సింది. నేను సాయంత్రం ఆరున్నరకి వస్తాను '

తర్వాతది ఇంగ్లీష్‌లో రాసింది. 'కాల్ మీ ఎనీ టైం ఇఫ్ యు నీడ్ ఎనీథింగ్ '

లవ్,

సి.

కాలకృత్యాలు తీర్చుకుని ఇంటర్నెట్ పాస్‌వర్డ్‌ని చూసి తన మొబైల్‌కి కనెక్ట్ చేసింది .వెంటనే కొన్ని మెసేజెస్‌కి అలర్ట్ సౌండ్స్ వరసగా వినిపించాయి. జినేంద్రనించి వచ్చిందా అని ఆశగా చూసింది. లేదు. తన క్లాస్‌మేట్‌నించి.

"పవన్ కళ్యాణ్ కొత్త సినిమా ఇవాళ విడుదలౌతోంది. వెళ్దామా?"

దానికి జవాబు పంపలేదు. స్నానం చేసి కిందకి వస్తూంటే పైకి వచ్చే మెయిడ్ కనిపించింది. ఆమె హేండ్ స్వీప్‌ని పక్కన పెట్టి ఆద్యని చూసి ఏప్రన్‌కి చేతులు తుడుచుకుని నవ్వుతూ చేతిని చాపి ఇంగ్లీష్‌లో చెప్పింది.

"హలో మేం! గుడ్ మార్నింగ్ అండ్ వెల్‌కం టు ఘానా. ఐ యాం అనస్థాషియా, ది మెయిడ్."

ఆద్యకూడా అప్రయత్నంగా చేతిని చాపి కరచాలనం చేసింది.

" మీరు వస్తున్నారని చైత్ర మేం నిన్న చెప్పింది. మీ అక్క జుట్టుకన్నా మీ జుట్టు చాలా పొడుగ్గా బావుంది" అనస్థాషియా దాన్ని ముట్టుకుని మెచ్చుకుంటూ చెప్పింది.

"థాంక్స్."

"యు ఆర్ బ్యూటిఫుల్."

ఆద్య సన్నగా నవ్వింది. కారు నలుపున్న ఆమెకి తన చర్మం రంగు నచ్చడంలో ఆశ్చర్యం లేదనుకుంది.

"నాకు మీ ఇండియా చూడాలని వుంది. నిజానికి నాకు ఆఫ్రికా కాక మిగిలిన మిగిలిన ఖండాలు చూడాలని ఉంది."

ఆద్య మొహం కడుక్కొచ్చి స్టవ్ మీద కాఫీ కలుపుకుని తాగుతూంటే ఆ ఆఫ్రికన్ యువతి ఇల్లు తుడుస్తూ మాట్లాడుతూనే ఉంది .ఆమె వాగుడుకాయ అని అర్ధమైంది.

"నాది టక్రోడీకాదు. ఉద్యోగం కోసం టుటుక గ్రామంనించి వచ్చాను. నేను మా కుటుంబాన్ని పోషించాలి కదా మరి. నాకు పెళ్ళి చేసుకోవాలని ఉంది. మాకు వరకట్నం ఉంటుంది. మీకుందా?" వాషిగ్ మెషీన్‌లో బట్టలని వేస్తూ అడిగింది.

"కొన్ని కుల్లాల్లో ఉంది. కొన్ని కులాల్లో తగ్గింది."

"ఆ విషయంలో ఇక్కడ మొగాళ్ళు చాలా ఖచ్చితంగా ఉంటారు. ఉద్యోగం చేసి కట్నం సొమ్ము సంపాదించి పెళ్ళిచేసుకోవాలని ఇందులో చేరాను. మా అమ్మా నాన్నలు సహాయం చేయరు. ఎవరి పెళ్ళి వాళ్ళే చేసుకోవాలి. పైగా

వాళ్ళని నేనే పోషించాలి. కట్నం సంపాదించడానికి ఇంకా కొన్నేళ్ళు పడుతుంది. కాని త్వరగా చేసుకోవాలని ఉంది. సంసారంకన్నా మా మగాళ్ళకి కట్నం ముఖ్యం. మా అక్క ట్రోకోసీగా వెళ్ళింది."

"ట్రోకోసీ అంటే?"

"మా ఘానాలో ట్రోకోసి పద్ధతి ఉంది. తమ బంధువుల పాపప్రక్షాళానికి ఏడేళ్ళ ఆడపిల్లల్ని క్రిస్టియన్ ష్రైన్‌కి పంపుతారు. ఇరవైనాలుగో ఏడు వచ్చేదాకా పదిహేడేళ్ళపాటు చర్చ్‌ని ఊడ్చి శుభ్రం చేయడం, ప్రీస్ట్ పొలం, ఇంటిపనులు చేయడంలాంటివి వాళ్ళు చేస్తారు. జీతం ఉండదు."

కుటుంబానికి దూరమై, చర్చ్‌లో ఊడిగంచేసే చిన్నారులని తల్చుకుంటే ఆద్యకి హృదయం ద్రవించింది.

"ఇప్పుడు ఇవి వచ్చాయి కాని పూర్వం ఆరెంజ్ తొక్కులు వంటిమీద రాసుకునేవారు. ఆ వాసనకి దోమలు రావు" మస్కిటో రెప్లెంట్‌ని చూసి అనస్థాషియా చెప్పింది.

పనయ్యాక ఆమె బయటకి వెళ్తూ ఆద్య అనుమతి తీసుకుని ఆమె జుట్టుని నిలువంటా తాకి చూసింది. అప్పటికే ఆమె తన జుట్టువంకే పదే పదే చూడటం ఆద్య గమనించింది.

"ఎంత అందంగా ఉందో చాలా పొడవు జుట్టు. బాబ్ట్ చేయించుకోకు. గుడ్ బై. సీ యు టుమారో" చెప్పింది.

అనస్థాషియా పక్క బిల్డింగ్ తలుపు తెరచుకుని అందులో పనిచెయ్యడానికి వెళ్ళింది. కొద్దిసేపటికి ఆద్య తలుపు తెరచుకుని బయటకి వచ్చింది. చర్చ్‌లోంచి పాటలు వినిపిస్తున్నాయి. పక్క బిల్డింగ్‌లోని కిటికీలోంచి ఇద్దరు తెల్లవాళ్ళు, ఓ నల్లవాడు కనిపించారు. విదేశీపాట వినిపిస్తోంది.

మొబైల్ మోగడంతో లోపలకి వెళ్ళింది.

చైత్రనించి.

"బ్రేక్‌ఫాస్ట్ తిన్నావా?"

"తిన్నాను."

"లంచ్ కూడా తిను. మిస్సవకు. సాయంత్రం బీచ్‌కి వెళ్దామా? మనింటినించి రెండు కిలోమీటర్ల దూరం. నీకు ఓపికుంటే నడిచి వెళ్ళచ్చు. ఊరు చూసినట్లుంటుంది. అసలు నువ్వు బీచ్‌కి ఎప్పుడన్నా వెళ్ళావా? లేదనుకుంటాను."

"లేదు. వెళ్దాం."

"ఐతే ఆరుంముప్పావుకల్లా తయారవు. యు విల్ ఎంజాయ్ ఇట్."

ఆద్య టి.వి ముందున్న రిమోట్ తీసుకుని ఆన్ చేసింది. రెండు ఛానల్స్ మార్చి మార్చి చూసింది. కాని ఆ రెండు ఆఫ్రికన్ ఛానల్స్‌లోని భాష అర్థంకాలేదు.

కాలక్షేపానికి ఇల్లంతా తిరిగి చూసింది. వివిధ రంగుల దళసరి కాగితాలతో మడిచిన పక్షులని గుచ్చిన దారపు తోరణం ఓ మూల మేకుకి అలంకారంగా వేలాడుతోంది. వివిధ సైజుల్లోని అలాంటి బొమ్మలు ఓ షోకేస్‌లో కనిపించాయి. ఫ్రిజ్‌కి అనేక దేశాలకి చెందిన ఫ్రిజ్ మేగ్నెట్స్ అతికించి ఉన్నాయి. అవన్నీ చైత్ర వెళ్ళిన వివిధ దేశాల్లో కొన్నవని గ్రహించింది. ఇటలీలో కొన్న బాటిల్ ఓపెనర్‌కి 'వైన్ ఓ క్లాక్' అనే మాటలున్నాయి. బెల్జియంలో కొన్న మేగ్నెట్ నంబర్ ఒన్ పోసే చిన్న పిల్లవాడి బొమ్మ. అనేక దేశాలకి చెందిన కళావస్తువులు కూడా కనిపించాయి.

పుస్తకాల షెల్ఫ్‌ని చూసింది. దాన్లోని పెట్టెని ఆసక్తిగా తీసి చూసింది. పెద్ద మౌత్ ఆర్గన్ కనిపించింది. కెన్ ఫాలెట్, జాన్ గ్రిషం నవలలు, నెల్సన్ మండేలా లంగ్ వాక్ టు ఫ్రీడం, జేమ్స్ వాల్విన్ ఏ షార్ట్ హిస్టరీ ఆఫ్ స్లేవరీ, లీ అయ్‌కోకా విత్ విలియం నోవక్ అయ్‌కోకా – ఏన్ ఆటోబయోగ్రఫీ, బరాక్ ఒబామా డ్రీంస్ ఫ్రం మై ఫాదర్, ఓరిగమీ అండ్ ఇకబానా – ప్రాక్టికల్ గైడ్ అనే పుస్తకం, అక్క ఇన్ని రకాల పుస్తకాలు చదువుతుందని ఆద్యకి తెలీదు. లేరీ కింగ్ రాసిన హౌ టు టాక్ టు ఎనీవన్, ఎనీ టైం, ఎనీవేర్ టైటిల్ ఆసక్తిగా అనిపించి తీసి చూసింది. మొదటి పేజీలో చైత్ర చేత్తో రాసిన కామెంట్‌ని చదివింది.

ఒనాఫ్ ది బెటర్ కమ్యూనికేషన్ బుక్స్ వితే లాజికల్ ఫ్లో ఆఫ్ టాపిక్స్ అండ్ ప్రాక్టికల్ ఎగ్జాంపుల్స్ దట్ టేక్స్ యు బేక్ టూ నైన్ టీన్ నైన్ టీస్ ఆఫ్ అమెరికా, బ్రాడ్ స్టోన్ రాసిన్ అజెఫ్ బెజోస్ అండ్ ది ఏజాఫ్ అమెజాన్ పుస్తకంలో రాసిన కామెంట్, ఏన్ ఇంటిలిజెంట్ అండ్ బోల్డ్ ఫౌండర్ – డిఫరెంట్ ఫ్రం ది రెస్టాఫ్ ది పేక్, జిం క్విక్ రాసిన లిమిట్‌లెస్ అనే పుస్తకంలో ఒన్ కె బికం లిమిట్‌లెస్ ఇఫ్ ఒన్ కెన్ మాస్టర్ ది ఎబిలిటీ టు లెర్న్ ఎనీథింగ్ అని, షోండా రైమ్స్ రాసిన ఇయర్ ఆఫ్ ఎస్‌లోని కామెంట్, కంటెంట్ డజంట్ ఎట్రాక్ట్ యాజ్ ది టైటిల్. క్యైటేన్ ఎనాయింగ్ రోడ్ అని ఉంది.

కొన్ని పుస్తకాల్లో చైత్ర అండర్‌లైన్ చేసిన వాక్యాలు, మార్జిన్‌లో రాసిన మాటలు కనిపించాయి. ఓ పుస్తకంలో అండర్‌లైన్ చేసిన ఓ వాక్యాన్ని చదివింది.

మనం తాత్కాలికంగా అప్సెట్ ఐనప్పుడు శాశ్వతమైన మూర్ఖపు పనిని చేయకూడదు.

ఆద్యకి పుస్తకాలు చదివే అలవాటు లేదు. ఐనా హౌ టు యూజ్ చాప్‌స్టిక్స్ అనే చిన్న బొమ్మల టీచింగ్ పుస్తకాన్ని తీసుకుంది. సెనగబద్దల్ని ఖాళీ కప్పులో పోసి వాటిని చాప్‌స్టిక్స్‌తో తీసే బొమ్మని చూసింది .బి.బి.బి.సి ఛానల్ని చూడమని క్రితం రాత్రి చైత్ర చెప్పింది గుర్తొచ్చి, టైం చూసి, టి.వి రిమోట్ అందుకుని మళ్ళీ టి.వి.ని ఆన్ చేసింది. బి.బి.సి ఛానల్లో ఓ నల్లజాగ్తి వ్యక్తిని చూపిస్తున్నారు. ఏంక ర్కంఠం ఇంగ్లీష్‌లో వినిపిస్తోంది.

"దిస్ డే దట్ ఇయర్"లోని ఆఖరి అంశం. ఫోటోలోని వ్యక్తి స్టీవెన్. స్టీవెన్‌కి తన వయసు ఎంతో తెలీదు. తన తల్లితండ్రులు కూడా తెలీని స్టీవెన్ విచిత్రమైన పరిస్థితిలో ఇరుక్కున్నాడు. ఆఫ్రికాలోని ఇతనికి, మీకు గల తేడా ఇతను స్వదేశంలేని మనిషి. తను జింబాబ్వేలోనో, మొజాంబిక్‌లోనో పుట్టానని అనుకుంటున్నాడు. అతనికి తన తండ్రి ఎవరో

తెలీదు. సివిల్ వార్‌లో ఓ దేశం నించి మరో దేశానికి పారిపోయిన తల్లి చిన్నప్పుడే మరణించింది కాబట్టి తనే దేశంలో పుట్టాడో తెలీదు. దాంతో అతనికి ఐ.డి లేదు ఫలితంగా చదువుకునే అవకాశంలేక, ఉద్యోగం దొరక్క, పౌరుడు పొందే ఏహక్కులు, లాభాలు లేకుండా రోడ్లమీద జీవిస్తున్నాడు. దానికన్నా జైలు సుఖం అనుకుని అతను ఇవాళ బ్రిటీష్ పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి తాని అరెస్ట్ చేయమని కోరాడు. కొద్ది క్షణాలు మీది అతనిలాంటి జీవితమైతే ఎలా ఉంటుందో ఊహించుకోండి.."

ఆద్య ఆ నల్లజాతి కుర్రాడివంక చూసింది. ఈ విశాల ప్రపంచంలో తనకంటూ, తనదంటూ ఏమీలేని స్థితి ఎంత దారుణం అని ఊహించుకుంటే అనిపించింది.

"ఇది చావులాంటిది. మరణించిన మనిషికి ఎవరూ ఉండరు. జీవించి ఉన్న నాకూ ఎవరూ లేరు" స్టీవెన్ చెప్పాడు.

"దీన్నించి మనమేం నేర్చుకోవచ్చు? మీతో పోలిస్తే అతనికి ఒక్క ప్రయోజనం కూడా లేదు. ఇప్పుడు మీరు దీన్ని చూసే టి.వి స్టీవెన్‌కి లేదు. మీలా తన తర్వాతి భోజనం ఎక్కడనించి వస్తుందో, అసలు వస్తుందో లేదో తెలీదు. మీ ఒంటిమీదలా శుభ్రమైన దుస్తులు లేవు. తల్లితండ్రులు, తోడబుట్టినవారు, విద్య, ఆదాయం మీకున్న ఏ ఒక్కటీ స్టీవెన్‌కి లేదు. అసలీ ప్రపంచంలో తనదంటూ దేహం తప్ప మరింకేం లేదు. ఐనా ధైర్యంగా జీవించగలుగుతున్నాడు. అదొక్కటీ చాలు మనిషికి ధైర్యం."

"అవును. నాకు ఏమీ లేకపోయినా నాకో దేహం ఉంది. చూడగలుగుతున్నాను. నడవగలుగుతున్నాను. వినగలుగుతున్నాను. అన్నిటికీ మించి జీవించగలుగుతున్నాను అనే దేవుడీ బ్లెస్సింగ్ నన్ను నిరాశకి గురి చెయ్యదు" స్టీవెన్ చెప్పాడు.

తర్వాత జాజ్ సంగీతం ఆరంభమవడంతో టి.వి ఆఫ్ చేసి ఆద్య అతను చెప్పినదాని గురించి ఆలోచిస్తూ లంచ్ వేడిచేసుకుంది. నిజమే. మనిషికి ఏం ఉన్నా, లేకపోయినా తన దేహం ఉండాలి. దానికోసమే అంతా పాటుపడేది. మరణ శిక్ష తప్పించుకోడానికి జడ్జ్‌కి లంచం, మృత్యుంజయ హోమం, ఐ.సి.యులో రోజుల తరబడి చికిత్స. దేహం కోసం ఎందరు ఎన్ని పనులు చేస్తారో ఆమెకి వరసగా గుర్తొచ్చాయి. తను తన దేహాన్ని వదిలి పెట్టాలనుకోవడం సరైనది కాదని స్ఫురించింది. మనసులో తనకున్న బ్లెస్సింగ్స్‌ని లెక్కపెట్టుకుంది. స్టీవెన్‌కి లేని అరవై మూడు తనకి ఉన్నాయని గ్రహించింది.

తలుపు తీసుకుని అనస్థాషియా లోపలకి వచ్చింది. ఆమె ఉదయం ఆరేసిన బట్టలని ఇస్త్రీ చేసి మడతలు నలగకుండా జాగ్రత్తగా పట్టుకొచ్చింది. మెట్లెక్కి ఎవరి గదిలో అలమరలో వారి బట్టలు సర్ది, టవల్స్ బాత్‌రూంలో తగిలించి మిగిలిన ఇళ్ళల్లో పనిచేయడానికి వెళ్ళిపోయింది.

వచ్చాక ఆద్య తనతో సరిగ్గా మాట్లాడకపోయినా చైత్ర ఏమీ అనుకోలేదు. ప్రేమలో అపజయంవల్ల కలిగే అవమానం, దుఃఖం తగ్గితేకాని మనసు సాధారణ స్థితికి రాదు, వస్తే కాని మాట్లాడదు అనుకుంది.

చైత్ర వచ్చే సమయానికి ఆద్య జీన్స్, కుర్తా వేసుకుని తయారైంది. సర్వెంట్స్ కోసం కట్టిన గది తెలుపు తెరచుకుని బయటకి వచ్చిన అనస్థాషియాని చూసి తక్షణం గుర్తుపట్టలేకపోయింది. తలకి పొడవైన జుట్టు. విగ్ అని అర్థం చేసుకుంది. పొడుగు గౌన్. చేతిలో గొడుగు, హేండ్ బేగ్, నల్లకళ్ళజోడు. మరోసారి బై చెప్పి ఆమె వెళ్ళిపోయింది. చైత్ర కారు కాంపౌండ్‌లో ఆగాక అందులోంచి చైత్రతోపాటు ఓ తెల్లజాతి మనిషి కూడా దిగడం ఆద్య కిటికీలోంచి చూసింది. సన్నగా, బలంగా ఉన్న దాదాపు నలభై ఏళ్ళతను ఆ బండిలోంచి ఓ పెద్ద మూటని తీసుకుని చైత్ర వెనకే లోపలకి వచ్చాడు. ఆద్య తలుపు తెరిచేలోగా చైత్ర తాళం చెవితో తాళం తెరిచి లోపలకి వచ్చింది. అతనా మూటని వంటగదిలో దించి ఆద్యవంక చూసి చిరునవ్వుతో పలకరించాడు.

"హలో ఆద్య! వెల్‌కం టు అవర్ ప్లేస్."

"ఇతను మిస్టర్ ఎన్రికో. నా కొలీగ్. ఇతని దేశం స్పెయిన్" చైత్ర ఇంగ్లీష్‌లో అతన్ని ఆద్యకి పరిచయం చేసింది.

వెంటనే అతను ఛాతీమీద ఓ సైడ్ మాత్రమే తగిలేలా తనని కౌగలించుకుంటే ఆద్య బిత్తరపోయింది.

"నువ్వు కూడా ఇంజనీర్ అని మీ అక్క చెప్పింది. ఇండియాలో తెలివిగలవాళ్ళు ఎక్కువ. ఇంజనీరింగ్ కష్టమైన కోర్స్" ఎన్రికో చెప్పాడు.

"ఇతను చాలా తెలివిగల ఇంజనీర్. సముద్రంలో ఆయిల్ రిగ్‌మీదకి వెళ్ళి పనిచేస్తాడు. అండ్ మోస్ట్ పెయిడ్ ఆల్సో" చైత్ర నవ్వుతూ ఇంగ్లీష్‌లో చెప్పింది.

"నువ్వు ఇండియాలో బయల్దేరినప్పటినించి మీ అక్క ఫ్లైట్ ట్రేసింగ్ వెబ్‌సైట్లోకి వెళ్ళి, నీ ఫ్లైట్ నంబర్లని ఫీడ్ చేసి నీ విమానం న్యూఢిల్లీకి చేరడం, అక్కడినుంచి ఆఫ్రికా ఖండంకి, తర్వాత ఆడిస్ అబాబాకి, మళ్ళీ అక్కడనించి ఆక్రాకి, ఆ తర్వాత టకరోడీకి చేరడాన్ని గంటగంటకీ గమనిస్తూనే ఉంది. నువ్వు విమానంలో ఏం తిన్నావో మాత్రం చూడలేకపోయింది. చివరికి నువ్వు టకరోడీలో దిగే సమయానికి అక్కడికి చేరుకుంది. నీ లొకేషన్‌ని ఎంత శ్రద్ధగా గమనించింది? కంగ్రాచ్యులేషన్స్ ఆద్యా, నిన్ను ప్రేమించే అక్క ఉన్నందుకు" ఎన్రికో చెప్పాడు.

"వెల్‌కం" ఆద్య సిగ్గుగా చెప్పింది.

"బియ్యం మూటని నేను మోయలేనని సహాయానికి వచ్చాడు. థాంక్స్ ఎన్రికో" చైత్ర చెప్పింది.

"ఎనీ టైం" అతను నవ్వుతూ చెప్పాడు.

"కాఫీ?" చైత్ర అడిగింది.

"వండ్రఫుల్ ఐడియా."

కాఫీ తాగాక ఎన్రికో ఆఫీస్ కారులో వెళ్ళిపోయాడు. అతను కారు ఎక్కాక చైత్ర అడిగింది.

"ఖాలెద్ ఎప్పుడు వస్తున్నాడో సమాచారం ఏదైనా తెలిసిందా?"

తల అడ్డంగా ఊపాడు.

చైత్ర తన గదిలోకి వెళ్ళి ఫ్రెష్ అయి ఫార్మల్స్‌ని విడిచి గౌన్ వేసుకుని వచ్చి అడిగింది.

"బీచ్‌కి రెడీనా?"

ఆద్య తల ఊపింది.

చైత్ర మస్కిటో రెపెలెంట్‌ని అందుకుని చెప్పింది.

"దీన్ని మనం మొబైల్‌ని ఎలా మర్చిపోమో అలా మర్చిపోకూడదు."

తన మోకాళ్ళమీద, కంద, పాదాలమీద, చేతులకి, మెడకి స్ప్రే చేసుకుని ఆద్యకిచ్చి చెప్పింది. "మొహానికి అవసరంలేదు. కళ్ళల్లో పడకూడదు. జాగ్రత్త."

ఇద్దరూ బయటకి వచ్చాక చైత్ర తలుపు హేండిల్‌కి ఉన్న ఇంటూ ఆకారంలోని దళసరి రబ్బర్ బేండ్‌ని తీసి తలుపు మూయగానే అది యాంత్రికంగా తాళం పడిపోయింది. తలుపు పిడికి ఉన్న దళసరి రబ్బర్ బేండ్‌ని లోపల, బయట హేండిల్‌కి ఇలా ఎక్స్ ఆకారంలో వేస్తే అప్పుడు లాక్ అవదు."

"ఈ రబ్బర్ బేండ్ ట్రిక్‌ని ఎక్కడ నేచుకున్నావక్కా?" ఆద్య అడిగింది.

"కష్టం, అనుభవం. ఎవరికైనా అవి చాలా పాఠాలని నేర్పిస్తాయి."

వాళ్ళని చూడగనే గార్డ్ఠక్కున లేచి పెడస్టియన్స్ గేట్ తీస్తూ చెప్పాడు.

"హలో. గుడీవినింగ్ మేడం."

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments